


# ఊరంతా ఉయ్యాలే!

**తప్పిపోయింది** మొగుడు కాదుగదా—అలక తీరగానే అలిగి వెతుక్కుంటూ వస్తాడులే అని ధైర్యంగా ఉండటానికి? చొక్కా, లాగూ తొడుక్కోవటం ఎలాగో తెలియని వాడు, బువ్వ చిందకుండా బొజ్జ నింపుకోవటం చేతకానివాడు, నాలుగేళ్ళయినా నిండని పాల బుగ్గల వాడు, కడుపున పుట్టిన కలకండ ముక్క గోపీ కనిపించక పోయేసరికి కంగారు పుట్టుకొచ్చేసింది మంగతాయారుకు.

భర్త భోజనం చేసి బడికి వెళ్ళిన తర్వాత మధ్యాహ్నం రెండు గంటలకు సినిమా బండి వైభవాన్ని చూడటానికి వీధిలోకి వెళ్ళింది తాను. ఆ వూర్లో ఉన్నది ఒక్కటే థియేటర్. కొత్త సినిమా వచ్చిందంటే చాలు, రాజుగారికి లేకలేక మగబిడ్డ పుట్టినంత సంబరం వూరికంతా. అదీ సంతరోజైతే, ఆ కోలాహలం ఇక చెప్ప నవసరం లేదు. డబ్బూ దస్కం దండిగా ఆర్జించిన సంపన్న వేశ్య రజస్వల అయిన తన కూతుర్ని ఇంట్లో కూచోబెడుతున్నంత సింగారం సినిమా బండికి! కన్నెపిల్ల కొత్త చీర కట్టుకున్నంత టెక్కుతో పోస్టర్లంటించిన తడికల్ని, మామిడాకుల తోరణాల్ని, చవకరకం పూల సరాల్ని ఒంటినిండా వేలాడదీసుకుని, నెత్తిమీది లౌడ్‌స్పీకర్లతో సంతగోలను గదమాయిస్తూ, మీది మీది కొస్తున్న కుర్రమూకను ముద్దులిచ్చి ఒదిలించుకుంటున్నట్లు కరపత్రాలు వెదజల్లేస్తూ, వూరిస్తూ, బులిపిస్తూ మందగమనంతో వీధి దాటి వెళ్ళింది రెండెడ్ల బండి. గోపీ కనిపించటం లేదన్న విషయం మరో పావు గంటకు గానీ స్ఫురించలేదు మంగతాయారుకు.

“గోపీ! గోపీ!” అంటూ ఇంట్లోనే నాలుగైదు సార్లు బిగ్గరగా పిలిచింది. వాకిట్లోకి వెళ్ళి వీధిని రెండు వైపులా దృష్టి సారించింది. తెలిసిన నాలుగిళ్ళకూ వెళ్ళి వాకబు చేసింది. ఇంకెక్కడని వెతకగలదు తాను? తనకా—వూరు కొత్త! వీధికొత్త! బదిలీపైన ఈ వూరొచ్చిన భర్తవెంట కదిలి వచ్చి ఈ ఇంట్లో కాపురానికి దిగి ఇంకా పదిరోజులైనా కాలేదు. తనకు కూడా ఇంకా దిక్కులే తెలియని ఈ వూర్లో, బుగ్గ గిల్లితే పాలుగారే పసివాడు ఎటు వెళ్ళాడో, ఏమైపోయాడో? మంగతాయారు బెంగ పడిపోయింది.

“మేష్టారు నైన్త్ క్లాస్ ఇంగ్లీషు అసైన్‌మెంట్ బుక్స్ తీసుకు రమ్మన్నా” రంటూ కుర్రాడొకడు సైకిల్ మీద ఇంటికొస్తే, వాడిద్వార భర్తకు కబురందజేసిం దామె. మరో ఐదు నిమిషాలకే, కాన్పు కష్టమై కాంతునికోసం కలవరిస్తున్నట్లున్న పెళ్ళాం దగ్గరికి వచ్చి వాలాడు రాజమాణిక్యం.

గబగబా నాలుగు వీధులూ తిరిగి, గోడకు కొట్టిన రబ్బరు బంతిలా ఇంటికి తిరిగొచ్చి, “ఎక్కడా కనిపించటం లేదు. బాబు తొడుక్కున్నది వక్కరంగు నిక్కరూ, ఎర్ర చారల చొక్కా కదూ?” అన్నాడు.

“అవును!” మంగతాయారుకు ఏడుపొచ్చేసింది.

“మరేం గాభరా పడకు! పోలీసు స్టేషన్‌కు వెళ్ళి చెప్పాను. సినిమా బండి వాళ్ళ చేత ఎనౌన్సు చేయించమని చెప్పి కానిస్టేబు లొకణ్ణి పంపించాడు ఎస్. ఐ. ఇప్పుడనగానే ఇన్‌స్పెక్షనంటూ వచ్చి కూర్చున్నాడు డి. ఇ. వో. సెకండ్ పీరియడ్ లీజర్ గనుక రాగలిగాను. నేను వెళ్ళి బడి వదలగానే వచ్చేస్తాను. దిగులెందుకూ? ఇది అడవి కాదుగదా? ఎక్కడో ఆడుకుంటూ ఉంటాడు” అంటూ, నిలబడనైనా నిలబడకుండా అరటి తొక్కమీద అడుగేసి జారిపోతున్న వాడిలా చరచరా వెళ్ళిపోయాడు రాజమాణిక్యం.

కూర్చున్న చోట కూర్చోలేక, నుంచున్నచోట నుంచోలేక ఇంట్లోకీ, వాకిట్లోకీ కాలుగాలిన పిల్లిలా తిరగ సాగింది మంగతాయారు. ఒకవైపున సంతా మరో వైపున బజారూ హోరుమంటున్నాయి. గోపీని భుజాల మీది కెక్కించుకుని ఏ పోలీసు ప్రత్యక్ష మవుతాడా అని వేయికళ్ళతో ఎదురు చూసిం దామె. నిమిషాలూ, గంటలూ దొర్లిపోతుంటే ఆమె నడుము విరిగిపోతున్నట్టుగా ఉంది.

సినిమా బండి రాక ముందు ఇంటి ముందర నిలబడి మొండికేసి కబళం పెట్టించుకు వెళ్ళిన ముష్టివాడి భయంకరాకారం హఠాత్తుగా ఆమె కళ్ళముందు మెదిలింది. ఒక వేళ వాడేమైనా బాబును పట్టుకెళ్ళిపోయాడా? ఈ ఆలోచన రాగానే, ఆమె పేరు పేరునా దేవుళ్ళను తలచి దండాలు పెట్టసాగింది.

సాయంకాలం నాలుగున్నరకు రాజమాణిక్యం వచ్చాడు. “ఇంకా రాలేదా?” అని అడిగి, కాఫీ అయినా తాగకుండా కొడుకును వెతకటానికి వెళ్ళిపోయాడు. మరో అరగంటకు సినిమా బండి వస్తున్న సద్దు వినిపించి, వాకిట్లోకి వెళ్ళింది మంగతాయారు.

ఊర్లోని వీధులూ, వూరి శివార్లలోని పేటలూ ఒక్కసారి చుట్టి వచ్చిన సినిమా బండి మళ్ళీ ఆ వీధిలో ప్రత్యక్షమైంది.

“ఆకుపాటు పిందె తడిసె, కోకమాటు పిల్ల తడిసె, ఆకాశ గంగొచ్చింది, అందాలు ముంచెత్తింది—” సినిమా రికార్డు.

“నేడే చూచి ఆనందించండి. మీ అభిమాన శ్రీ వేంకటేశ్వరా స్క్రీన్‌లో ఆంధ్రుల అభిమాన నటుడు విశ్వ విఖ్యాత నటసార్వభౌమ, నటరత్న డాక్టర్ నందమూరి తారక రామారావూ, అందచందాలతో కనువిందుచేసే పదహారేళ్ళ పరువాల శ్రీదేవి నటించిన సాటిలేని మేటి మహత్తర వర్ణచిత్రం వేటగాడు — వేటగాడు — వేటగాడు ...” సినిమా వ్యాఖ్యానం.

“నాలుగేళ్ళ అబ్బాయి తప్పిపోయాడు. పేరు గోపీ. వక్కరంగు నిక్కరు, ఎర్రచారల చొక్కా తొడుక్కున్నాడు. చూచిన వారు పోలీస్ స్టేషన్‌లో అప్పగించ గించ ప్రార్థన!” ... ప్రకటన.

“పుట్టింటోళ్ళు తరిమేశారు, కట్టుకున్నోడు ఒదిలేశాడు, పట్టుమనీ పదారేళ్ళురా, నా సామీ ...” మళ్ళీ సినిమా పాట.

సినిమా బండి దగ్గరి కొచ్చింది. ఇంటి ముందు నుంచీ వెళ్ళిపోతోంది.

అదుగో గోపీ!

బండి వెనక బండి కూచాన్ని గట్టిగా పట్టుకుని రెండు కాళ్ళూ పైకెత్తి బంగారపు గొలుసులో డాలర్‌లా వేలాడుతున్నాడు.

సంతోషంతో నోరు పడిపోయేలా “బాబూ!” అని కేక పెట్టింది మంగతాయారు. గోపీ కాళ్ళు నేల మీదికి దించి, బండిని ఒదిలేసి “అమ్మా!” అంటూ పరుగెత్తు కొచ్చాడు. ఆమె వాణ్ణి వాటేసి పైకెత్తుకుని ఇంట్లో కొచ్చింది. వాడి ఒళ్ళంతా ముద్దులాడేసింది. గోపీ కాళ్ళ నిండా దుమ్ము. వాడి వక్కరంగు నిక్కరునిండా, ఎర్ర చారల చొక్కానిండా దుమ్ము!

ఆమె వాణ్ణి కిందికి దించి, దుమ్ము కొట్టుకున్న బట్టల్ని విప్పి, వాడి పొట్టని, పిర్రల్ని తడుముతూ “ఎక్కడి కెళ్ళావురా?” అని అడిగింది.

బుడిబుడి మాటలతో వాడు చెప్పిన జవాబు వింటే మంగతాయారుకే కాదు— ఎవరైనా ఆశ్చర్య పోవలసిందే! వాడు ఎక్కడికీ వెళ్ళలేదు. మధ్యాహ్నం నుంచీ ఇప్పటిదాకా బండి వెంటనే ఉన్నాడు!

ఆ సినిమా బండిలో కూర్చున్న అనౌన్సరు గుడ్డివాడు. కరపత్రా లందించే వాడు చెవిటివాడు. బండి తోలే వాడికేమో వెనక చూపులేదు. పోనీ, పోలీసుల కేమైంది? ప్రజలకేమైంది? వాళ్ళకు కూడా లేవా కళ్ళూ, చెవులూ? తనకోసం తపించిపోయే తల్లి కళ్ళకు పున్నమి చంద్రుడుగానూ, తన వూసు పట్టించుకోకుండా తీయని గంతులు కట్టుకున్న ఇతరుల కళ్ళకు అమావాస్య చంద్రుడుగానూ— రెండు కళలు ఒకే గోపీలో ఎలా అమరాయి?

ఉయ్యాలలోనే ఉన్నాడు బిడ్డ. అయితే మమకారం అనేది కన్న తల్లికి ఉంటుందే గానీ, ఉయ్యాలకు ఉండదు కదా?

**- కలువకొలను సదానంద**